ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పట్టాలెక్కని ప్రగతి

- నాలుగేళ్లలో ముందుకు సాగని పనులు
- పలు ప్రాజెక్టులకు పరిపాలన ఆమోదంతో సరి
- వైసిపి నాలుగేళ్ల పాలన తీరూతెన్నూ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయ్యాయి. 2019 మే 30వ తేదీన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేశారు. గడిచిన నాలుగేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆశించిన అభివృద్ధి జరగలేదు. పలు ప్రాజెక్టులు, పథకాలు కాగితాలకే పరిమితమవడంపై అధికార పార్టీ నేతల నుండే పెదవి విరుపులు వస్తున్నాయి. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

దీర్ఘకాలిక కలగా 'వరికపూడిశెల'

ప్రస్తుత పల్నాడు జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వరికిపూడిశెల ప్రాజెక్టుకు అటవీ పర్యావరణ శాఖ నుంచి ఇటీవల అనుమతి లభించింది. కేంద్రంతో వైసిపి ప్రభుత్వం సఖ్యతగా ఉన్నా ఈ అనుమతి పొందడానికి నాలుగేళ్లు పట్టింది. ఈ ప్రాజెక్టు రానున్న ఏడాదిలో పూర్తవుతుందనే గ్యారంటీ లేకుండా పోయింది. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలాల్లో సాగు, తాగునీటి సరఫరాకు ఉద్దేశించిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం ప్రస్తుతం భూసేకరణ, డిటైల్డు ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

భూసేకరణ దశలోగుంటూరు ఛానల్ పనులు

గుంటూరు ఛానల్ పొడిగింపు, విస్తరణ పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. వట్టిచెరుకూరు మండలం గారపాడు నుంచి పర్చూరు వరకు పొడించాలన్న ప్రతిపాదన మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



చొరవతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో మొత్తం 441 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. 2015 మే 27న టిడిపి ప్రభుత్వం రూ.378.25 కోట్ల అంచనాలతో గుంటూరు ఛానల్ ఆధునీకరణ, పొడిగింపునకు పరిపాలన ఆమోదం తెలపగా 8 ఏళ్లుగా అదిగో ఇదిగో అంటూ రెండు ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ వచ్చాయి. మూడు నెలలుగా ఈ పనులపై అధికారులు దృష్టిసారించారు.

వాటర్ గ్రిడ్ ఉన్నట్టా ...లేనట్టా...

9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు పరిపాలన ఆమోదం తెలిపినా ఇంతరకు కార్యరూపం దాల్చలేదు. పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు గుంటూరు జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేసేందుకు రూ.2600 కోట్లతో ప్రతిపాదించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. నిధుల కొరత, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల పనులు జరగడం లేదని చెబుతున్నారు. అసలు ఈ

▶ 2లో



కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు

సమరశీల పోరాటాలు

సిఐటియు ఆవిర్భావ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ఉన్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి, సమరశీల పోరాటాలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగారావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి స్థానిక బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సిఐటియు నగర పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న నర్సింగారావు మాట్లాడుతూ ప్రస్తుత వర్గ పోరాట సిద్ధాంతాన్ని నిలబెట్టటానికి సిఐటియు ఆవిర్భవించిందని పేర్కొన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీ నిరంతరంగా కొనసాగుతోందని, కార్మిక శ్రమను మరింత దోచుకోవటానికి దేశంలో శాశ్వత పని స్వభావం కలిగిన నియామకాలు పక్కన పెట్టి, తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ వంటివి అందులో భాగమేనని, ఆఖరికి రక్షణ రంగంలోనూ అగ్నిపథ్ పేరుతో తాత్కాలిక నియామకాలు చేపట్టారని విమర్శించారు. రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తూ, పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెడుతోందన్నారు. కోవిడ్‌లో అన్ని రంగాలూ దెబ్బతిన్నా పెట్టుబడిదారులు మాత్రం లాభాలు

▶ 2లో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గుర్తింపు కార్డు జారీలో ఆ నిబంధనొద్దు

- భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా జారీ చేయాలి
- సచివాలయం, ఆర్‌బికె అధికారులు గ్రామ సభలు పెట్టి కౌల్దార్లను గుర్తించండి
- కార్డులు, రాయితీలు దక్కక వాస్తవ సాగుదార్లకు కష్టాలు
- సమస్యల పరిష్కారం కోసం 5-10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాతాలు
- కరపత్రాన్ని ఆవిష్కరించిన కౌలురైతు సంఘం

2 లో

రైల్వే బ్రిడ్జికి డ్రెయినేజీ గండం..

- మురుగునీటి ఊటతో దెబ్బతిన్న లైనింగ్
- బ్రిడ్జీని చుట్టుముట్టిన మురుగునీరు
- నిర్మాణం పూర్తికి అవాంతరాలు

ప్రజాశక్తి - వినుకొండ

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి రైల్వే బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. కోట్ల రూపాయల రైల్వే నిధులు డ్రెయినేజీ పాలవుతున్నాయి. నిత్యం రద్దీగా రాకపోకలు సాగిస్తున్న రోడ్డు మార్గంలో ఆటంకంగా ఉన్న రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జీలు నిర్మిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ముందు డ్రెయినేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాతే బ్రిడ్జి నిర్మాణాలు చేపడతారు. వినుకొండ పట్టణం నుండి నూజెండ్ల వైపు వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద గతేడాది అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. డ్రెయినేజీ సమస్య లేకుండా చేస్తామని మున్సిపల్



అధికారులు ముందస్తు ఒప్పందంతోనే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. సుమారు రూ.4.35 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా డ్రెయినేజీ వూట ఆ బ్రిడ్జిని వెంటాడుతోంది. ఆరు నెలల్లో పూర్తి కావాల్సిన బ్రిడ్జి నిర్మాణం ఈ సమస్య వలన ఏడాదైనా పూర్తి కాలేదు.

మురుగునీటి పారుదల నిలిచి బ్రిడ్జిని చుట్టుముట్టింది. అండర్ బ్రిడ్జీలోనూ నీరు నిలిచి వాహన రాకపోకలకు తీవ్ర

▶ 2లో

మొదటి పేజీ తరువాయి

సమరశీల పోరాటాలు

ఆర్జించారని చెప్పారు. మరోవైపు దేశంలో కార్మిక వర్గం ప్రశ్నించకుండా ఉండేందుకు బిజెపి ప్రభుత్వం కులం, మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. 2024లో అధికారంలోకి వస్తే దేశాన్ని మత రాజ్యంగా ప్రకటించాలని చూస్తోందన్నారు. కార్మిక వర్గం బిజెపి తప్పుడు ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, కార్మిక వర్గ పోరాటాలకు పదును పెంచాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన నాటి నుంచి కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా 1991 నుంచి అమలు చేస్తున్న ప్రపంచ బ్యాంకు సంస్కరణల దుష్ప్రభావాలను కార్మికులకు వివరిస్తూ వాటిపై నికరంగా పోరాడుతున్న సంఘం సిఐటియు అన్నారు. ఇతర సంఘాలతో ఐక్య పోరాటాలు చేయటంలో, శ్రామిక శక్తులతో కలిసి పోరాటాలు నిర్వహించటంలో ముఖ్యభూమిక పోషిస్తోందన్నారు. రానున్న రోజుల్లో విశాల ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, వి.దుర్గారావు, షేక్.హుస్సేన్‌వలి, ఎన్.శివాజీ, ఎం.భాగ్యరాజు, ఎన్.రమేష్‌బాబు, వై.సుబ్బారావు, ఎం.సాంబశివరావు, వివికె.సురేష్, సిహెచ్.కుమార్, అబ్దుల్ సలీం, వెంకటప్పయ్య, నళినీకాంత్ పాల్గొన్నారు.



రైల్వే బ్రిడ్జికి డ్రెయినేజీ గండం..

అంతరాయం కలిగిస్తోంది. కొన్ని సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. బ్రిడ్జి లైనింగ్ ప్లాట్ఫారం డ్రెయినేజీ ఊట ప్రభావానికి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిపై భాగంలో ఇరువైపులా మురుగునీరు నిలిచి సమీపంలో నీళ్లలోకి ప్రవహించాయి. వినుకొండ నుండి ఏనుగుపాలెం రోడ్డులో కూడా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉందని, మునిసిపల్ డ్రైనేజీ సమస్య వలన ఆ పనులు చేపట్టలేదని రైల్వే అధికారులకు చెప్పినట్లు కాంట్రాక్టర్ అంటున్నారు. అయితే మురుగు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ డిఇ వెంకయ్య చెబుతున్నారు.

కోటప్పకొండను సందర్శించిన బాపట్ల ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నరసరావుపేట

కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మంగళవారం సందర్శించారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎం.శివరామకృష్ణ ప్రసాద్, సతీష్, బిపి.కుమార్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ : పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మంగళవారం కలిశారు. కోటప్పకొండకు వచ్చిన రఘుపతిని విశ్వసాయి కాలేజీ ఆహ్వానించగా వచ్చిన ఆయన ఆల్ ఇండియా స్థాయి మెయిన్స్, ఇంటర్మీడియట్ స్థాయిలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అందుకు కృషి చేసిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావనీ, అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. అండర్-17 ఆల్ ఇండియా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన కళాశాల పూర్వ విద్యార్థి మంజునాథ్‌ను అభినందించారు.



గుర్తింపు కార్డు జారీలో ఆ నిబంధనొద్దు

ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్న కౌలు రైతులకు 2019 పంట సాగు దారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో కౌల్దార్లు ఇబ్బంది పడుతున్నారని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ అన్నారు. ఈ చట్టంలో మార్పులు చేసి కౌలు రైతుకు సులభంగా గుర్తింపు కార్డు మంజూరు లక్ష్యంగా కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో 5-10 తేదీల్లో ప్రచార జాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వినతి పత్రాల సమర్పణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వాస్తవ సాగుదారులైన కౌల్దార్లకు పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారాలు దక్కక అడుగడుగునా నష్టపోతున్నారని చెప్పారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అయిన నేపథ్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డు రావడం లేదన్నారు. యజమాని సంతకంతో పని లేకుండా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహించి గుర్తింపు కార్డులు, రుణాలు, రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. సాగు భారంగా భావించిన 75 శాతం మంది రైతులు వ్యవసాయాన్ని మానుకుంటున్నారని, ఈ నేపథ్యంలో కౌలురైతులే ఆ భూమినంతా సాగు చేస్తున్నారని, అయితే వారిని మాత్రం ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. భూ యజమానుల అపోహలను తొలగించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. రామారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 41 వేల మంది కౌల్దార్లకు గుర్తింపు కార్డులిచ్చామని అధికారులు చెబుతున్నా రుణాలు మాత్రం 100 మందికే ఇప్పించారని, గుర్తింపుకార్డుల్లోనూ 30 శాతం బోగస్ కార్డులుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న జాతాలు నెల్లూరు, అనకాపల్లి నుండి ప్రారంభ అవుతాయని, 10వ తేదీన కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో పాదయాత్ర ప్రారంభం అవుతుందని, 12న ప్రకాశం బ్యారేజీ మీదుగా పాదయాత్ర మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయం వద్దకు చేరుకుని రాయబార కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమాల్లో కౌలురైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సిఐటియు నాయకులు డి.డి.శివకుమారి, ఎస్.వెంకటేశ్వరరాజు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పనిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులివ్వండి

ప్రజాశక్తి - వినుకొండ



పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులివ్వాలని అధికారులను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించగా 32 మంది కౌన్సిలర్లకుగాను 10 మందే హాజరయ్యారు. ఎజెండాలోని 23 అంశాల్లో రెండు అంశాలు చదివి వినిపించి మిగతావాటినీ ఒకేసారి ఆమోదించారు. 24వ వార్డు కౌన్సిలర్ కాంట్రాక్టు గౌస్ బాషా మాట్లాడుతూ రుద్రపాటి ముదిరాజు, కాకర్ల మహేందర్ రెడ్డి కాంట్రాక్టర్లు గతంలో ఇచ్చిన నామినేషన్ పనులు చేయలేదని, అలాంటి వాళ్లకు తిరిగి వార్డుల్లో నామినేషన్ వర్కులు ఇచ్చారని అభ్యంతరం వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్మన్‌కు సమాచారం ఇవ్వకుండా వర్కులు ఇచ్చారని, గతంలో చెప్పినా అధికారులు పెడచెవిన పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పనిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చి పనిచేసే కాంట్రాక్టర్లకే ఇవ్వాలని చైర్మన్ ఆదేశించారు. 12వ వార్డు కౌన్సిలర్ బాషా మాట్లాడుతూ పట్టణంలోని 12 సచివాలయాల్లో అధిక శాతం ఉద్యోగులు ఇన్చార్జులుగా వ్యవహరిస్తున్నారని, దీనివలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణానికి చెందిన అనేకమంది ఉద్యోగులు వేరువేరు ప్రాంతాల్లో సచివాలయాల్లో పనిచేస్తున్నారని అన్నారు. వినుకొండ పట్టణంలోని సచివాలయాల్లో ఖాళీలను గుర్తిస్తే జూన్ మూడో తేదీ జరిగే బదిలీల్లో స్థానిక ఉద్యోగులు సచివాలయాల్లో నియమితులయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనికి మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు స్పందిస్తూ ఖాళీలపై ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు.

భారీ ర్యాలీలతో వైసిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే పాలనను ఈ నాలుగేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లయిన సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా చిలకలూరిపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం రజిని మాట్లాడుతూ కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తమ ప్రభుత్వం గొప్ప సంస్కరణలు తెచ్చిందని పలు పథకాలను వివరించారు. టిడిపిపై విమర్శలు చేశారు. **నరసరావుపేట** స్థానిక వైసిపి కార్యాలయంలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కట్ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు కపట నాటకాలు ఆడుతున్నారని విమర్శలు గుప్పించారు. వైసిపి ప్రజారంజకంగా పాలిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ వినాయకం, డిప్యూటీ డిఎంహెచ్ఒ చంద్రశేఖర్, ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ రంగారావు, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వినుకొండలో** ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మొదట వైసిపి కార్యాలయంలో కేకును కట్ చేశారు. **పెదకూరపాడు**లో కేక్‌ను కట్ చేశారు. ఎంపిపి బి.మీరయ్య, వైసిపి మండల కన్వీనర్ షరీఫ్ మాట్లాడారు. **బెల్లంకొండలో** వైసిపి శ్రేణులు నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే ఎన్.శంకరరావు భార్య వసంతకుమారి హాజరయ్యారు. కేక్‌ను కట్ చేశారు. ఎంపిపి చెన్నప్పరెడ్డి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, దేవాదాయ శాఖ చైర్మన్ ఎం.ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. **పిడుగురాళ్ల** వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామారావు కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.ముక్కంటి, జయాలుద్దన్, వైసిపి మండల అధ్యక్షులు చల్లా పిచ్చిరెడ్డి, ఎం.సుధీర్, జి.పవన్‌రెడ్డి, ఎం.ప్రేమరాజ్ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.



నరసరావుపేటలో బైక్‌ర్యాలీలో ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

పట్టాలెక్కని ప్రగతి

పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నుంచి ఎటువంటి సమాచారమూ లేదు.

ముందుకు సాగని వైఎస్సార్ పల్నాడు దుర్భిక్ష పథకం

గోదావరి జలాలను సాగర్ జలాశయంలోకి ఎత్తిపోసేందుకు రూపొందించిన డాక్టర్ వైఎస్సార్ పల్నాడు దుర్భిక్ష నివారణ పథకంపై భూ సేకరణ దశలోనే ఉండిపోయింది. వైకుంఠపురం నుంచి నకరికల్లు వరకు ఐదు ఎత్తిపోతల పథకాలను నిర్మించి సాగర్ కాల్వలకు గోదావరి జలాలను అనుసంధానం చేసే గోదావరి-పెన్నా అనుసంధాన పథకాన్ని పేరు మార్చిన ప్రభుత్వం గత 4 ఏళ్లుగా ఈ పథకంపై దృష్టి సారించలేదు.

టెండర్ల దశ దాటనిరహదారులు

పల్నాడు ప్రాంతంలో పలు రహదారులు జాతీయ రహదారులుగా మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడంలేదు. దాచేపల్లి-మాచర్ల, నాగార్జున సాగర్-దేవులపల్లి, పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేసేందుకు ఇచ్చిన ఉత్తర్వులు ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కొండమోడు-పేరేచర్లరహదారి అధ్వానంగా మారినా మరమ్మతులకూ నోచుకోవడం లేదు. కొండమోడు -పేరేచర్ల మార్గంలో నాలుగులైన్ల రహదారి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. రాజధాని అమరావతి నుంచి అనంతపురం వరకు తలపెట్టిన ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

తిరోగమనంలో పారిశ్రామిక పురోగతి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోవడం లేదు. కొత్తగా భారీ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలేమీ లేవు. సహజ వనరులు, ఎన్నో నిక్షేపాలున్నా వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. పల్నాడులోని సున్నపురాయి, ముగ్గురాయి, నాపరాయి, గ్రానైట్ నిక్షేపాలను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించే వారు ఎక్కువగా ఉన్నారు. ఈ నిక్షేపాలతో స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపించడం లేదు. గుంటూరులో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ భజరంగ్ జ్యూట్‌మిల్లు మూతపడి ఏడేళ్లు దాటింది. మిల్లు తెరిపించి కార్మికులకు న్యాయం చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇంత వరకు దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోయారు. ప్రస్తుతం రాయితీలు అందక స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు సంక్షోభంలో ఉన్నాయి.

అమరావతి అభివృద్ధి అస్తవ్యస్తం

రాజధాని అమరావతి అభివృద్ధి నిలిచిపోయింది. గత నాలుగేళ్లలో ఒకటి రెండు మినహా మిగతా అభివృద్ధి పనులు ఏమీ జరగలేదు. కరకట్ట విస్తరణ పనులు మాత్రమే చేపట్టారు. రూ.3 వేల కోట్లతో అసంపూర్తిగా ఉన్నపనులు పూర్తి చేస్తామనే పనులు ముందుకు సాగలేదు. మూడు రాజధానులను తెరపైకి తెచ్చి 2019 డిసెంబరు 17 నుంచి ఇప్పటివరకు 1260 రోజులుగా సాగుతున్న ఉద్యమాన్ని కృత్రిమ ఉద్యమంగా అభివర్ణించిన ప్రభుత్వ పెద్దలు అమరావతిని తాము అభివృద్ధి చేయలేమని హైకోర్టులోనే అఫిడవిట్ దాఖలు చేశారు. తాజాగా ఆర్5 జోన్ లో 50,793 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టించడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

యుజిడి పనులపై నిర్లక్ష్యం

గుంటూరులో 2017లో ప్రారంభం అయిన భూగర్భ డ్రెయినేజి పనులు నాలుగేళ్లుగా పాలకులు పట్టించుకోవడం లేదు. 2020 జనవరికి పూర్తి కావాల్సిన పనులు 2019 మే నెలలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా ఆగిపోయాయి. రూ.903 కోట్లతో చేపట్టిన ఈ పనులు 55 శాతం మేరకు జరిగాయి. దాదాపు రూ.505 కోట్లతో పనులు చేసినట్టు చెబుతుండగా మిగతా పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇటీవల సిఎం జగన్ గతేడాది గుంటూరు వచ్చిన సందర్భంలో యుజిడి పనులకు రూ.232 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

అంగలకుదురులో భారీ చోరీ

రూ.15 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరణ



ప్రజాశక్తి-తెనాలి:

రూరల్ గ్రామం అంగలకుదురులో భారీ చోరీ జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఆలపాటి సాంబశివరావు, అతని భార్య పద్మజ, తల్లి శేషమ్మతో కలిసి అంగలకుదురులో ఉంటున్నాడు. ఇటీవల కుమార్తె, అల్లుడు కూడా వచ్చారు. వ్యక్తగత పనుల నిమిత్తం సోమవారం రాత్రి సాంబశివరావు విశాఖపట్నం వెళ్ళాడు. ఇంట్లో ఉన్న వారు వేర్వేరు గదుల్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ప్రధాన ద్వారం పక్కనే ఉన్న ఐరన్ గ్రిల్‌ను తొలగించి దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తలుపులు తెరిచి దాదాపు 315 గ్రాముల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి వస్తువులు అపహరించారు. ఉదయం లేచి చూసేసరికి బీరువా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పరిశీలించి, దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు క్లూస్‌టీమ్ ను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని డిఎస్పీ బి.జనార్ధనరావు, ఎస్ఐలు సిహెచ్ వెంకటేశ్వరు, డి.ప్రసన్నకుమార్ పరిశీలించారు. దాదాపు రూ.15లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు. రూరల్ ఎస్ఐ డి.ప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

దాడికేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి

అర్థిక లావాదేవీల నేపధ్యంలో వ్యక్తిపై దాడి చేసి, బలవంతంగా నగదు, సెల్‌ఫోన్ లాక్కున్న ఘటనలో నిందితుడిని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు అరెస్ట్ చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగలకుదురుకు చెందిన జి.రవి మోటారు బైక్‌ల సీటు కవర్లు కుడుతుంటాడు. అదే గ్రామానికి చెందిన సాలవ సురేంద్ర అలియాస్ సూరితో ఆర్థిక పరమైన లావాదేవీల విషయం స్పర్ధలున్నాయి. ఈ నేపథ్యంలో సురేంద్ర, అతని మిత్రుడు దాసరి ప్రభు, ప్రవీణ్ కలిసి రవిపై దాడి చేశారు. అంతే కాకుండా ఊరిబయటకు తీసుకెళ్ళి దాడి చేసి, ఆ సన్నివేశాలను మొబైల్‌లో చిత్రీకరించారు. బాధితుని మొబైల్ ఫోన్, కొంత నగదును లాక్కున్నారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు సురేంద్రను అరెస్ట్ చేశారు. అతను లాక్కున్న మొబైల్‌ను, నగదును స్వాధీనం చేసుకుని, నిందితుడిని మంగళవారం కోర్టుకు హాజరు పరచగా అతనికి న్యాయమూర్తి పి.రాజశేఖర్ 14 రోజులు రిమాండ్ విదించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ బోల్తా.. డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల పరిధిలోని కోనూరు ఇసుక రీచ్‌లో ప్రమాదవశాత్తు ఇసుక లారీ బోల్తా పడిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది వివరాలు ఇలా ఉన్నాయి కోనూరు ఇసుక రిచ్‌లో నదికి అడ్డంగా తూములు వేసి ఇసుక మూటలతో అడ్డుకట్టలు వేసి వాటిపై మట్టిని తోలి ఏర్పాటు చేశారు. నది అవతల భాగానికి లారీలు వెళ్లి లోడింగ్ చేసుకొని ఆ దారి గుండా మరలా తిరిగి రావాలి. ఈ క్రమంలో ఏపీ39 టి టి7826 నెంబర్ గల లారీ ఇసుక లోడింగ్ చేసుకొని దాటుతున్న క్రమంలో లారీ అదుపుతప్పి నదిలోకి పడిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో ప్రాణాలు కాపాడుకున్నాడు

పేకాట శిబిరంపై దాడి భారీగా నగదు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి:

పట్టణంలో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడి చేశారు. అత్యంత పగడ్బందీ సమాచారంతో స్థానిక కొత్తపేటలోని అమరావతి లాడ్జిలో దాడులు నిర్వహించిన అధికారులు 13 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి పెద్దమొత్తంలో రూ.2,83,580 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంథోనిరాజ్, ఎస్ఈబి బృందం ఇన్‌స్పెక్టర్ టి.పెదనారాయణస్వామి, ఎస్ఐ ఆరిఫ్, తెనాలి ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ ఏవి చలం, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



టిడిపి కార్యకర్తకు ఆనంద్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక సాయి భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమతలూరు మండలం ఇంటూరుకు చెందిన టిడిపి కార్యకర్త వెరిచర్ల నాగరాజును మంగళవారం మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పరామర్శించారు. రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడు బహిరంగ సభ వద్ద వర్షానికి ఈదురు గాలులు వల్ల ఇనుమరాడ్లు విరిగిన ప్రమాదంలోనాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడిన ఆనంద్‌బాబు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు, 42 వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్(బుజ్జి),పార్టీ ఉపాధ్యక్షులు గోళ్ళ ప్రభాకర్ ఉన్నారు.



టిడిపి ప్రచార కమిటీలో సాయికృష్ణకు చోటు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

టిడిపి ప్రచార కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 మంది యువతలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయికి అవకాశం దక్కింది. రానున్న ఎన్నికల్లో టిడిపిని విజయపథంలో నడిపించేందుకు వీలుగా 20 మంది స్టార్ కాంపైనర్లను ఎంపిక చేశారు. సోషల్ మీడియాలో చురకైనపాత్రపోషించే విధంగా వీరికి అవకాశం కల్పించారు. ప్రభుత్వప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ రాజీలేనిపోరాటం చేస్తున్నందున 20 మంది చురుకైన కార్యకర్తలను ఎంపిక చేసి ట్టు సాయికృష్ణ తెలిపారు. ఈమేరకు రాజమండ్రిలోజరిగిన మహానాడులో రావిపాటి సాయి పార్టీ కోసం చేస్తున్నకృషిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంపి గల్లా జయదేవ్ ఇతర జిల్లా నాయకులకు రావిపాటి కృతజ్ఞతలు తెలిపారు.



నిరాటంకంగా సంక్షేమ పథకాలు : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్ పదవీ బాధ్యతలు స్వీకరించి నాలుగు ఏళ్లు నిండిన సందర్భంగా మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వైసిపి కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు జరిగాయి. సంక్షేమ పథకాలకు జగన్ చేసిన తొలిసంతకంతో రాష్ట్రంలో కొత్త ఒరవడితో పేదలకు అనేక పథకాలు అమలు అవుతున్నాయని వైసిపిజిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వర ప్రసాద్ తెలిపారు.అనేక ఆర్థిక ఇబ్బందులు వచ్చిన ఏఒక్క పథకాన్ని ఆపకుండానిరంతరం కొనసాగించారని అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తిగా నిలిస్తే ఈ స్ఫూర్తిని జగన్ మరింత పట్టుదలతో కొనసాగించారని కొనియాడారు. పేదలకు అందుతున్న పథకాలపై కొన్ని తరగతుల వారు ఈర్ష్య అసూయతో ఉన్నారని అన్నారు. పేదలు ఆర్థికంగా బలపడితేనే నిజమైన అభివృద్ధి జరుగుతుందని నమ్మిన వ్యక్తి సిఎం జగన్ అని చంద్రగిరి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, వైసిపి నాయకులు నూరిఫాతిమా, మేరిగ విజయలక్ష్మీ, రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. తొలుల కేకు కట్ కేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వైఎస్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నేతలు నివాళి అర్పించారు.

మహానాడులో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-తాడేపల్లి : పట్టణంలోని మహానాడు 1, 7వ రోడ్డుల్లో మంగళవారం మంచినీటి సరఫరా చేసే మోటార్లు మొరాయించాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలకు మంచినీరు అందలేదు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు రెండు మంచినీటి ట్యాంకర్లను ఆ ప్రాంతానికి పంపించి తాగునీటిని సరఫరా చేశారు.



మంచినీటి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మంచినీరు సరఫరా చేస్తామని పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తెలిపారు.



వానతో ఉపశమనం

ప్రజాశక్తి - మాచర్ల

వేసవి తీవ్రతతో కొన్ని రోజులుగా ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడుతున్న మాచర్ల పరిసర ప్రాంతాల ప్రజలకు మంగళవారం వర్షం ఊరటనిచ్చింది. వాతావరణం చల్లబర్చటంతో ప్రజలకు ఉపశమనం కలిగినట్లయింది. మంగళవారం ఉదయం నుండే ఆకాశం మేఘావృతమై 9 గంటల నుండి సుమారు 3 గంటల పాటు వర్షం కురిసింది.



బ్రహ్మారెడ్డికి ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎంపిడిఒ

త్రిపురాపురం సర్పంచ్ బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని త్రిపురాపురం సర్పంచ్‌గా బ్రహ్మారెడ్డి ఎన్నికైనట్లు ఎంపిడిఒ షేక్ జిలానిబాషా తెలిపారు. ఈ మేరకు ధ్రువపత్రాన్ని బ్రహ్మారెడ్డికి మంగళవారం అందించారు. ఆయనకు ఎంపిపి ఎం.జయరామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నక్క నాగిరెడ్డి, నూజెండ్ల సొసైటీ చైర్మన్ పి.పిచ్చిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్

కౌల్దారు కార్డుతో భూయజమానికి నష్టమేమీ ఉండదు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

పంట సాగు హక్కు పత్రాలపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బొల్లవరంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. తహశీల్దార్ భవానీ శంకర్, మండల వ్యవసాయాధికారి అరుణ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు సిసిఆర్‌సి కార్డు పొందడానికి అర్హుడని, దీనివల్ల భూయజమాని హక్కులకేమీ నష్టం ఉండదని చెప్పారు. ఇది భూ యజమానికీ సాగుదారునికీ మధ్య ఉండే ఒప్పంద పత్రం మాత్రమేనని, ఒప్పంద పత్రం కాల పరిమితి 11 నెలలే ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత ఆ కార్డు ఉపయోగపడదని అన్నారు. సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులకు దక్కే రుణాలు, రాయితీలు, ఇతర పథకాలపై వివరించారు. పంటల బీమా పథకం వర్తిస్తుందని, రూ.లక్షలోపు రుణం సున్నా వడ్డీకే పొందొచ్చని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలైతే రైతు భరోసా కూడా వస్తుందన్నారు. పంటలకు మార్కెట్లో ధర సరిగా లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కపిల్‌దేవ్, విఆర్వో సంజీవరావు, విఎఎ శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

నేలకు బలం.. పచ్చిరొట్ట విత్తనం..

- అయినా సాగుకు ఆసక్తి చూపని రైతు
- అవగాహన లోపంతో ఖర్చుకు వెనకడుగు



పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విక్రయానికి సిద్ధంగా ఉంచిన విత్తనాల బ్యాగులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

అధిక దిగుబడి సాధించటానికి సాగులో రసాయన ఎరువులు వినియోగం పెరిగిన విషయం తెలిసిందే. అయితే ఇది అనేక అనర్థాలకు దారితీస్తుందని, నేల భౌతిక లక్షణాలు దెబ్బతింటున్నాయి, నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని కోల్పోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటి నుండో హెచ్చరిస్తున్నారు. సూక్ష్మ పోషక లోపాలు తరచుగా వస్తాయని, ఉత్పాదకత తగ్గుతుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో రసాయన ఎరువులు వినియోగం తగ్గించడం, నేల సహజత్వాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు సాధించడం అవసరమని చెబుతున్నారు. ఇందుకు పచ్చిరొట్ట పైర్ల సాగు ఎంతో ఉపయుక్తమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇవి నేలలో తేలికగా కలిసిపోయే స్వభావం కలిగి ఉంటాయని, భూమికి బలాన్నిస్తాయని, ఈ విత్తనాలను పొలంలో చల్లి అవి పెరిగాక కలియదున్నడం భూసారం పెంపుదలకు దోహద పడుతుందని అంటున్నారు. జనుము, పిల్లి పెసర, అలసంద, వెంపల్లి, ఉలవ, పెసర. తీగ జాతి మొక్కలు, పప్పు జాతి గింజలు, ఆకు కూరల ఇందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు.

పచ్చిరొట్ట పైర్లను మే, జూన్ లేదా తొలకరి వర్షాలు మొదలైనప్పుడు నాటుకోవచ్చు. పచ్చిరొట్ట దిగుబడి, నత్రజని స్థిరీకరణ పచ్చిరొట్ట, పైరు దశ మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ దిగుబడి రావడానికి 45 రోజుల సమయం పడుతుంది. పూత దశలో కలియదున్నడం వల్ల అత్యధిక సత్తువను చేకూరుస్తుంది. రోటావేటరు లేదా పవర్ టిల్లర్ ద్వారా కలియదున్నుకోవచ్చు. నత్రజని వృథాగా పోకుండా ఉండటానికి కనీసం 15-22 అంగుళాల లోతు వరకు దున్నుకోవాలి.

పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియల వల్ల భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయి. దీనివల్ల నత్రజని ఎరువుల వినియోగాన్ని 25-30 శాతం వరకు తగ్గించవచ్చు. నేల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు నేల కోతను అరికట్టొచ్చు. తెగుళ్లను తట్టుకునేలా పైరుకు శక్తినిస్తుంది. భూమి గుల్లబారి మొక్క వేర్లకు గాలి, నీరు పుష్కలంగా అందుతుంది. దీర్ఘకాలిక పంటల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగి నేల చౌడుబారకుండా ఉంటుంది. ముఖ్యంగా వాణిజ్య పంటలు సాగు చేసే ప్రాంతాలలో మిరప ఇతర పంట ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల దిగుబడి 15-20 శాతం పెరుగుతుందని రుజువైంది. రసం పీల్చే పురుగులు కూడా తగ్గే అవకాశం ఉంది.

పచ్చిరొట్ట పైర్ల సాగుకు ఇటీవల మిర్చి రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. పెదకూరపాడు మండలంలో గతేడాది 3500 ఎకరాల్లో ఈ పచ్చిరొట్ల పైర్లు సాగు చేశారు. ఈ ఏడాదీ ఇదింకా పెరుగుతుందని అంచనా. అయితే మొత్తం సాగు భూమిలో ఇది చాలా పరిమితమైన విస్తీర్ణమే. రైతుల కోసం 30 రకాల విత్తనాలను ప్రకృతి వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉంచారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందొచ్చు. గతంలో ముందుగా నగదు చెల్లించిన రైతులకే విత్తనాలు అందించేవారు. అయితే ఈ విధానంలో రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఈ ఏడాది ముందుగానే విత్తనాలను తెప్పించి అందుబాటులో ఉంచారు.

మండలంలో ప్రధానంగా పత్తి, మిర్చి, సోయా చిక్కుడు, వరి, పసుపు తదితర పంటలు సాగవుతుంటాయి. జులై మొదటి వారం తర్వాత పత్తి సాగు మొదలవుతుంది. మిర్చి సాగు ఆగస్టులోను, సోయా చిక్కుడు సాగు జూన్ ఆఖరు వారం లేదా జులై మొదటి వారంలో ప్రారంభం అవుతుంది. సాధారణంగా పచ్చిరొట్ట ఎరువుల సాగుకాలం 40-45 రోజుల వరకూ ఉంటుంది. ఈ క్రమంలో పచ్చిరొట్ల సాగుకు సమయం లేని కారణంగా మిర్చి రైతులు వరకే వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మరికొంతమంది రైతులు ఖర్చుకు వెనకాడుతున్నారు. విత్తనాలు కొనుగోలుకు రూ.1000-1500 అవుతుందని, వాటిని సాగుచేసి రెండుసార్లు కలియదున్నడానికి తడవకు రూ.2 వేలు చొప్పున రూ.4 వేల వరకూ అవుతుందని చెబుతున్నారు. ఇదే ఖర్చుతో సాధారణ సాగు విత్తనాలు లేదా ఒకసారి మందులు వస్తాయని చెబుతున్నారు. అయితే పచ్చిరొట్ట సాగుతో వచ్చే లాభాలతో పోలిస్తే ఖర్చు ఎక్కువేం కాదనే విషయంపై రైతుల్లో అవగాహన కొరవడింది.

50 శాతం రాయితీతో సిద్ధం



పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూసారం పెరుగుతుంది. పైరులో చీడపీడలు కూడా తగ్గే అవకాశం ఉంది. దీనిపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. 50 శాతం రాయితీపై అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, పిల్లిపెసర విత్తనాలను సిద్ధంగా ఉంచాం.

శాంతి, మండల వ్యవసాయాధికారి

పలుచోట్ల సిఐటియు జెండావిష్కరణలు



వినుకొండలో జెండావిష్కరణ చేస్తున్న హనుమంతరెడ్డి

ప్రజాశక్తి - వినుకొండ

సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలోని పలుచోట్ల సిఐటియు జెండాలను ఎగురవేశారు. ఇందులో భాగంగా వినుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయం వద్ద జెండాను సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికై సిఐటియు నిరంతర పోరాటం చేస్తోందని చెప్పారు. కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయడం ద్వారానే హక్కులు సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వరరావు, సిలార్, ఎ.ఆంజనేయులు, మదార్‌వలి, నవీన్, రంజాన్‌బి, నాసర్‌బి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్డు రిక్షా పాయింట్ వద్ద జెండాను సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఏర్పాటు నేపథ్యాన్ని, పోరాటాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, వీటిని ఐక్యఉద్యమాలతో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. హక్కుల కోసం పోరాడాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం కోసం బిఎస్ఎన్ఎల్, రైల్వే, పోస్టల్, విశాఖ ఉక్కువంటి పరిశ్రమలు కాపాడుకోవడం కోసం అనేక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు షేక్ మాబు, సిహెచ్ ముక్కంటి, రాఘవులు, కనకారావు, లింగయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

పిడుగురాళ్ల



ప్రజాశక్తి చిలకలూరిపేట

స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, ఇందుకనుగుణంగా 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. హక్కుల కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బాబు, ఎం.విల్సన్, పి.గణేష్, పి.భారతి, బి.కోటానాయక్, చక్రధర్, చిన్న పాల్గొన్నారు.



చిలకలూరిపేట



మాస్టర్ క్రీడాకారుల్ని అభినందిస్తున్న చీఫ్ కోచ్, తదితరులు

వెయిట్ లిఫ్టింగ్‌లో మాస్టర్ క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి- గుంటూరు

తెలంగాణ మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ హైదరాబాద్‌లో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన పోటీలలో గుంటూరు బి.ఆర్ స్టేడియం మాస్టర్ క్రీడాకారులు ప్రతిభ చూపించారు. వి.దుర్గాప్రసాద్ బంగారు పతకం, కె.నాగరాజు బ్రాంజ్, యం.శ్రీనివాసకుమార్ గోల్డ్, జె.శ్రీనివాసరావు సిల్వర్, బివిఎల్ నరసింహారావు సిల్వర్, టి.భాస్కరరావు గోల్డ్, ఆర్‌వియఎస్ఎస్ శర్మ గోల్డ్, డి.రత్నరాజు బ్రాంజ్, గోపు హరిప్రసాద్ 4వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, హెల్త్ క్లబ్ జిమ్ కార్యదర్శి, ఫిట్నెస్ కోచ్ దుర్గాప్రసాద్, శిక్షకులు ఉదయ్ కిరణ్ తదితరులు అభినందించారు.

జిల్లా చీఫ్ కోచ్ బదిలీ..

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, విజయవాడలో ఇన్‌ఛార్జి ఏడీగా బదిలీ అయినట్లు స్టెప్ సిఇఒ ఎస్.పల్లవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బిఆర్ స్టేడియం వద్ద హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. మంగళవారం బి.ఆర్ స్టేడియంవద్ద రూ.1.24 కోట్లతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైయస్ ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ముస్తఫాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా 560 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తున్నారని, వాటిలో గుంటూరు నగరంలో 16 సెంటర్లు ఉన్నాయని చెప్పారు. ఒక్కొక్క సెంటర్‌కు రూ.1 కోటి నిధులు మంజూరు చేస్తుందన్నారు. అలాగే ఇప్పటికే నగరంలో 10 హెల్త్ సెంటర్లలో ఒక్కొక్క దానికి మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించి, పేద మధ్య తరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ హెల్త్ సెంటర్లలో ఆపరేషన్లు తప్ప మిగిలిన అన్ని రకాల చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం అధునాతన, ఆధునిక హంగులతో నిర్మిస్తున్నారన్నారు. ప్రభుత్వం నియోజకవర్గాలలో జనాభా ప్రాతిపదికన ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం బలోపేతం చేయటానికి, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటానికి అవసరమైన అన్ని చోట్లా హెల్త్ సెంటర్లు నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ వెంకట కష్ణయ్య, యస్.ఈ భాస్కర్, ఈ.ఈ కోటేశ్వర రావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

సిఐటియు ఆవిర్భావ సభల్లో నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రకాష్‌నగర్‌లో ప్రజాశక్తి డైలీ ప్రిటింగ్ ప్రెస్ కార్యాలయం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పతాకాన్ని యూనియన్ నాయకులు శౌరిబర్తులం ఆవిష్కరించారు. దుర్గారావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. మూడు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించి వేస్తుందని మండిపడ్డారు. ఐక్య పోరాటాల ద్వారానే బిజెపి తిప్పికొట్టగలమని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, ఎం.దుర్గారావు, బి.యేషయ్య, కె.వెంగమ్మ, బి.సత్యం, నరసింహారావు, తులసి, శ్రీకాంత్, కమల, బుజ్జమ్మ, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ప్రకాష్ నగర్‌లో జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకానిలో సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సభ ఆనంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ సిఐటియు 1970 లో ఏర్పడిందని, సిఐటియు ఏర్పడిన తర్వాత దేశంలో నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులకి అండగా ఉండి ఐక్య పోరాటం నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాల్లో మార్పు చేసి పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ చేస్తూ ఆదాని అంబానీ లాంటివారికి మేలు చేసి, కార్మికులకు నష్టం కలిగించే లాగా కార్మిక చట్టాలు మార్పు చేశారన్నారు. అంగన్వాడి, ఆశ ,మధ్యాహ్న భోజనం తదితర కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో రామారావు, కె రాజకుమారి, కే సంతోష్, పి మరియమ్మ, వి శోభ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో మాట్లాడుతున్న ఎన్ శివాజి

ఉద్యోగుల మొర అలకించండి

కలెక్టరేట్ వద్ద ఎపి జెఎసి అమరావతి దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల ఆవేదనను ప్రభుత్వం ఆలకించాలని ఎపి జెఎసి అమరావతి నాయకులు కోరారు. జెఎసి మూడో విడత ఉద్యమంలో భాగంగా మంగళవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు ముఖ్యవక్తగా హాజరైన ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఏపి పిటిడి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ మాట్లాడుతూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో 83 రోజులుగా ఉద్యమం చేస్తున్నామని, ప్రతి ఉద్యోగి బాధ్యతను భుజాలపై తీసుకుని ముందుకు వెళుతున్నామన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగుతామని, జోరు వానను సైతం లెక్కచేయకుండా సామూహిక నిరాహారదీక్షలో పాల్గొన్న ఉద్యోగుల చిత్తశుద్ధి, ఐక్యతే అందుకు నిదర్శనం అని తెలిపారు. జూన్ 8వ తేదీన గుంటూరులో జరిగే 'నాల్గవ ప్రాంతీయ సదస్సును' జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏపి జెఏసి అమరావతి జిల్లా చైర్మన్ కనపర్తి సంగీతరావు, ప్రధాన కార్యదర్శి పీఏ కిరణ్ కుమార్, కో చైర్మన్ ఫారెస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. విజయ్ కుమార్, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్ వివిధ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న దామోదర్

బాధ్యతగల పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి-గుంటూరు

బాల బాలికలు భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని డాక్టర్ పి.అనంతలక్ష్మి అన్నారు. గుంటూరు అమరావతి రోడ్డు, నగరాలులో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఐద్వా గుంటూరు నగర అధ్యక్షురాలు జి. రమణ అధ్యక్షత వహించారు. అనంతలక్ష్మి మాట్లాడుతూ బాలబాలికలు తమ విద్య, విజ్ఞానాన్ని సమాజం ద్వారానే పొందగలుగుతారని, తద్వారా మంచి విజ్ఞానవంతులుగా తయారై సమాజానికి తమ వంతు సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందరికీ ఉండే మెదడు ఒకటేనని దానిని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా కొంతమంది మేధావులుగా అభివృద్ధి అవుతారని అన్నారు. సమాజం కోసం పని చేసిన వారే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని, అలాంటి వారిని బాలబాలికలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంఘం జిల్లా బాధ్యులు ఎన్. భావన్నారాయణ స్వేచ్ఛ సంస్థ రాష్ట్ర బాధ్యులు కె.రవికాంత్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ తదితరులు పాల్గొన్నారు



చిన్నారులకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ అనంతలక్ష్మి

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి -తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11:30 గంటలకు కౌన్సిల్ హాల్ లో జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం మంగళవారం తెలిపారు. పట్టణ అభివద్ధికి సంబంధించి పొందుపరచిన అజెండా అంశాలపై చర్చ ఉంటుందని, సభ్యులు విధిగా పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

శాస్త్రవేత్త నీలి రాజేంద్రకు పదోన్నతి

పలువురి అభినందన

ప్రజాశక్తి - మంగళగిరి




బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న మంగళగిరికి చెందిన నీలి గుణేశ్వర రావు మాస్టారు కుమారుడు నీలి రాజేంద్ర అత్యుత్తమ శాస్త్రవేత్తగా పదోన్నతి సాధించారు. నీలి రాజేంద్రను అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి ధనుంజయ్ రావు మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి ఎన్నో విజయాలు సాధిస్తూ నేడు ఈ స్థాయికి ఎదిగిన రాజేంద్ర ముందు ముందు మరిన్ని విజయాలు సాధించి మంగళగిరి కీర్తి నిలబెట్టాలని కోరుతున్నట్లుగా తెలిపారు.

దీనావస్థలో రాజధాని పేదలు, దళితులు

దళిత జెఎసి నాయకులు పులి చిన్నా

ప్రజాశక్తి - తుళ్లూరు



దళితులకు ఏం ఒరగబెట్టారని సంబరాలు చేసుకుంటున్నారో వైసిపి నాయకులు చెప్పాలని అమరావతి దళిత జెఎసి నాయకులు,అసైన్డ్ రైతు పులి చిన్నా డిమాండ్ చేశారు. మంగళవారం రాజధాని గ్రామం ఉద్దండరాయు నిపాలెం లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ రాజధానిలో దళితులు, ఇతర పేదలు దుర్భర జీవనం గడుపుతున్నారని అన్నారు. వ్యవసాయం లేక చేసేందుకు పనులు లేక, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవడంతో కడు దీనావస్థలో రోజులు వెళ్ళదీస్తున్నారని చెప్పారు. విచారణ పేరుతో దళితులు, ఇతర పేదలకు ఏళ్ల తరబడి ప్రభుత్వం కౌలు చెల్లించడం లేదని మండిపడ్డారు. వివాదాలు సృష్టించి, కోర్టు తీర్పులను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం సెంటు స్థలం పంపిణీ ఆర్భాటంగా చేశారని, వారి ఉపాధికి ఏమి చేస్తారో మాత్రం చెప్పడం లేదన్నారు. రాష్ట్రం లోనూ దళితులకు వైసిపి పాలనలో ఎలాంటి మేలు జరగలేదన్నారు. నాలుగేళ్ల పాలన పూర్తయ్యిందని చేసుకుంటున్న సంబరాలు వైసిపికి అఖరివని అన్నారు. టిడిపి మేనిఫెస్టో వైసిపి నాయకులలో కలవరం కలిగిస్తోందన్నారు.



వెంకటపాలెం లో కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేస్తున్న రాజధాని రైతులు

1260వ రోజుకు ఆందోళనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 1260 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా రైతులు,చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్,ఐదు కోట్ల ఆంధ్రుల రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేశారు.



ఆధ్వానంగా గ్రామీణ రహదార్లు : కాంగ్రెస్

ప్రజాశక్తి - మాచర్ల

గ్రామీణ రహదారులు ఆధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయటమో లేదా కొత్తగా నిర్మించడమో చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పలు గ్రామాల్లో తాము పర్యటించామని, జమ్మలమడక, తుమ్మకోట, మల్లవరం, జెట్టిపాలెం, కంచరగుంట, మంగాపురంతండా తదితర గ్రామాల రహదారుల చాల ఆధ్వానంగా ఉన్నాయని చెప్పారు. వాహనదారులు, పాదచారులు ఈ రహదారిపై బాగ ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే సత్వరమే స్పందించాలని, రహదార్లను బాగు చేయించాలని కోరారు. ఆయనవెంట నాయకులు వెంకటేశ్వర్లు, బాబు, ఆర్.ప్రతాప్‌బాబు ఉన్నారు.

రైతు సమ్మేళనంపై ప్రచారం

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 13,14,15 లలో నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలంలో మంగళవారం ప్రచారం చేయగా స్థానిక చెరువుకట్ట సెంటర్లో కరపత్రాలు ఆవిష్కరించారు. యు.రాము, జి.సుబ్బారెడ్డి, కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు, వి.వెంకట్, ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ

బాల్యవివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై మండలంలోని సాతులూరులో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు వల్ల మాతా, శిశు మరణాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు రాఘవయ్య రమేష్, ఎఎన్ఎంలు రాజేశ్వరి, అఖిల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వద్ద చంద్రబాబు చిత్రపటానికి కార్యకర్తలు మంగళశారం పాలాభిషేకం



చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా మాట్లాడారు. ఎ.రమాదేవి, అనిత భాయి, కౌన్సిలర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసేస్తున్న ఐద్వా నాయకులు

బిజెపి ఎంపీ అరెస్టు కోసం వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మహిళా రెజ్లర్ల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజినీ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసిల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తిరస్కరించటం దుర్మార్గమన్నారు. బ్రిజ్ భూషన్‌తోపాటు హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను అరెస్టు చేసి మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఉమశ్రీ, జి.మేరమ్మ, దుర్గాబాయి, డి.సుజాత పాల్గొన్నారు

భూ రీసర్వేపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం ద్వారా చేపట్టిన రీ సర్వేను నూరుశాతం పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జిల్లాకేంద్రమైన నరసరావుపేటలోని తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. పలు అంశాలపై సిబ్బందిని వివరాలడిగారు. రీ సర్వే జరిగిన ఒక గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ స్టేజ్ నుంచి ఆర్ఒఆర్ స్టేజ్ వరకు చేసిన పనుల వివరాలను పరిశీలించారు. నరసరావుపేట పరిధిలో 14 రెవెన్యూ గ్రామాలుండగా, 11 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. 8 గ్రామాల్లో రీ సర్వే చేసిన అనంతరం అయా గ్రామాల రైతులకు శాశ్వత పత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. మూడు గ్రామాలలో జూన్ చివరి నాటికి రీ సర్వే పూర్తి చేసి భూ హక్కు పత్రాలను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వేకు అనుసరిస్తున్న విధానాన్ని, ఫార్మేట్ విధానంలో రూపొందించి నివేదికను తనకు పంపాలని, ఇదే విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట రీ సర్వే అమలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు, ఆర్‌డిఒ శేషిరెడ్డి, తహశీల్దార్ రమణ నాయక్, సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారు.



నివేదికలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ఏళ్ల తరబడి పెండింగ్‌లో జీవాల పెంపకందార్ల పరిహారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

వైయస్సార్ పశుబీమా పథకంతో పాటు లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ సంబంధించి లబ్ధిదారుల వాటను ప్రభుత్వమే చెల్లించాలని ఏపి గొర్రెల, మేకల పెంపకందార్ల రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సమావేశంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశనికి ఎనుముల బజారు అధ్యక్షత వహించగా తిరుపతిరావు మాట్లాడుతూ వివిధ ప్రమాదాలు, జబ్బులు, పిడుగు పాటుకు గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని, పెంపకందార్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. ప్రభుత్వం నష్ట పరిహారం పథకం క్రింద నమోదు చేసి రెండేళ్లు దాటినా పరిహారం ఇవ్వలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.200 కోట్ల పరిహారం పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లయినా ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదని, ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమిస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు జి.బాలకృష్ణ, ఎం.చినవీరయ్య, వై.బాలాజి, ఎం.కోటయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు



మాట్లాడుతున్న ఎంపిపి జయరామిరెడ్డి

గ్రామోదయంపై ముందుగానే చెప్పండి

ప్రజాశక్తి - నూజెండ్ల

మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎం.జయరామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సమస్యలపై పలువురు సభ్యులు ప్రస్తావించారు. గ్రామోదయం కార్యక్రమం గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు ముందుగా చెప్పాలని కోరారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించాలని, వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులను రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాఇవేశంలో ఎంపిడిఒం జిలానిబాషా, తహశీల్దార్ మధుబాబు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో పతకాల విజేతలు

కరాటేలో మాచర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

చిలకలూరిపేటలోని గ్రీన్‌వ్యాలీ మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ పోటీల్లో మాచర్లలోని శ్రీ గురు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే అకాడమీ విద్యార్థులు నలుగురు ప్రతిభ చూపారు. 15 ఏళ్ల విభాగంలో డమరుకం కృష్ణమనోహర్ బంగారు పతకం, బ్లాక్‌బెల్ట్ కైవసం చేసుకోగా భవజ్ఞేశ్వర్ రజత పతకాన్ని సాధించారు. బాలికల 14 ఏళ్ల విభాగంలో పర్ణిక, రేణుశ్రీ రజత పతకాలను సాధించారు. వీరిని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, రాజా, బాలు, మాస్టర్ నాగకుమార్ అభినందించారు.

అబద్ధాల ప్రచారంలో వైసిపి : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దేశంలోనే ధనిక సిఎంగా గుర్తింపు పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అంటూ మంత్రి రజిని అభివర్ణించడం రాజకీయ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేదలకు నివాసయోగ్యం కాని ఇళ్ల స్థలాలను ఇవ్వడాన్ని చంద్రబాబు తప్పుబట్టగా దానిపై వైసిపి దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. అబద్ధాల ప్రచారం కోసం రోజుకో కార్యక్రమాన్ని వైసిపి చేస్తోందని, మరోవైపు టిడిపి హయాంలో కట్టిన 5 వేల టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వకుండా శిథిలం చేస్తున్నారని విమర్శించారు. సిఎం పేదల పక్షపాతి అయితే ఈ నాలుగేళ్లలో పేదలకు ఇచ్చిన ఇళ్ళ స్థలాల్లో ఎన్నిళ్లు కట్టించారో చెప్పాలని ప్రశ్నించారు. స్థానిక మంత్రికి తెలిసిందల్లా ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూముల కొనుగోళ్లలో బినామీల ద్వారా దండుకోవడమేనని, కొన్ని చెక్కులపై ఆ పార్టీ ఎంపీయే ఫిర్యాదు చేశారని అన్నారు. ఒకప్పుడు మహానాడులో అద్భుతంగా నటించింది ఎవరో గుర్తు తెచ్చుకోవాలని ఎద్దేవ చేశారు. నాడు జగన్‌ను రాక్షసునితో పోల్చలేదా? అని ప్రశ్నించారు.

టిడిపి సీనియర్ నాయకుని మృతికి సంతాపం

ప్రజాశక్తి - బెల్లంకొండ

టిడిపి సీనియర్ నాయకులు కె.చల్లమయ్య బుధవారం మరణించారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చల్లమయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి సంతాపం తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను కార్యకర్తల ద్వారా శ్రీధర్ అందించారు. నివాళులర్పించిన వారిలో వి.పేరయ్య, డాక్టర్ కొరపోలు పెద్ద వెంకయ్య, టి.రామకృష్ణ, ఐ.వీరాంజనేయులు, ఐ.శ్రీనివాసరావు, డి.అనిల్ కుమార్, గోపాలకృష్ణ, చిన్న ఆల్లయ్య ఉన్నారు.



సోలార్ విద్యుత్, నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించాలి

కేంద్ర పంచాయతీరాజ్ అడిషనల్ కార్యదర్శి చంద్రశేఖర్

చింతలపూడిలో భూ రీసర్వే పనులు పరిశీలన

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని చింతలపూడి గ్రామంలో నిర్వహించిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష గ్రామ సర్వేను మంగళవారం కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ అడిషనల్ సెక్రెటరీ చంద్రశేఖర్ కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి సందర్శించారు. భూ సర్వే నిర్వహిస్తున్న విధానంతో పాటు రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ పట్ల కూడా సంతప్తిని వ్యక్తం చేశారు. చింతలపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామ కంఠం రీ సర్వే జరిగిన విధానంపై ఏర్పాటు చేసిన ఫోటోల ప్రదర్శన ద్వారా సర్వేకి సంబంధించి ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గ్రామంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, నోటిఫికేషన్లు గురించి గ్రామ సర్వేయరు వివరించారు. అనంతరం అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సర్పంచి, వార్డు సభ్యులతో సమావేశమయ్యారు. వారు నిర్వహించే విధులు, గ్రామంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు, పర్యవేక్షణ చేస్తున్న తీరు తదితర అంశాలపై అధికారులకు సిబ్బంది వివరించారు. గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమాలతో పాటు సోలర్ ఎనర్జీని, కాష్ లెస్ చెల్లింపులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ ద్వారా రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న భూహక్కు మరియు భూరక్ష పథకంలో వ్యవసాయ భూములతో పాటు గ్రామ కంఠాలు సర్వే జరుగుతుందన్నారు. బ్రిటిష్ కాలంలో జరిగిన వ్యవసాయ భూములు రీ సర్వేతో పాటు తొలిసారిగా గ్రామ కంఠాలను సర్వే చేసి రికార్డులను సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. అందువలన ప్రోసిజర్ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి, గ్రామ సభలు నిర్వహించి, గ్రామ ప్రజలను భాగస్వాములను చేస్తూ సర్వే జరుగుతుందన్నారు. చింతలపూడిలో ఇప్పటికే సర్వే పూర్తి అయ్యి రికార్డులు సిద్ధం చేయటం జరిగిందని, ఆన్లైన్ లో అప్లోడ్ ప్రక్రియ కొద్దిరోజుల్లో పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహనరావు, డీపీవో కేశవరెడ్డి, సర్వే, ల్యాండ్ రికార్డ్సు ఏడీ రూప్లా నాయక్, తహశీల్దారు మల్లేశ్వరి, సర్పంచి రామకష్ణ పాల్గొన్నారు.


చింతలపూడి గ్రామంలో భూ రీసర్వే చార్టును పరిశీలిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

జూన్ చివరి నాటికి శాశ్వత భూహక్కు రీసర్వే పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి-గుంటూరు

వైస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి జిల్లాలో అమలు జరుతున్న రీ-సర్వే ప్రక్రియను జూన్ నెల చివరకు పూర్తి చేసి, హద్దురాళ్లని పాతి, రైతులకు స్వచ్ఛమైన రెవెన్యూ రికార్డులు, భూహక్కు పత్రాల రూపంలో అందజేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలియజేశారు. సర్వే ప్రగతిపై మంగళవారం పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తెనాలి, దుగ్గిరాల, మేడి కొండూరు మండల తాసీల్దార్లు, ఏడి సర్వే , డిఐఓ ఎస్‌లు , మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులతో జెసి రాజ కుమారి మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. జిల్లాలో ఫేజ్-2లో భాగంగా 25 గ్రామాలలో రీసెర్వే ప్రక్రియ చేపట్టబడిందని, మేడికొండూరు 9 గ్రామాలు, వట్టిచెరుకూరు 9 గ్రామాలు, దుగ్గిరాల 2గ్రామాలు, ప్రతిపాడు 2గ్రామాలు, తెనాలి 2గ్రామాలు, పెదనందిపాడు1 గ్రామంలో మొత్తంగా 52,282 ఎకరాలలో రీసర్వే మొదలుపెట్టి, ఇప్పటివరకు 10 గ్రామాల్లో సర్వే, బౌండరీస్ చట్టం ప్రకారం, సెక్షన్-13 నోటిఫికేషన్ తుది రెవెన్యూ రికార్డులు తయారు చేయుట కూడా పూర్తి అయ్యిందని, మిగిలిన 15గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయి వివిధ దశలో రీ -సర్వే ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. రైతులందరూ రీసర్వేకి సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న జెసి రాజకుమారి


నివాళులర్పిస్తున్న ఎం రవి, తదితరులు

పుతుంబాక వెంకటపతికి ఘన నివాళి

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

సిపిఎం నేత,మాజీ శాసనసభ్యులు పుతుంబాక వెంకటపతి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. రాజధాని లోని నిడమర్రులో పుతుంబాక వెంకటపతి 30 వర్ధంతిని పురస్కరించుకొని గైరుబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో రవి మాట్లాడుతూ పుతుంబాక వెంకటపతి జీవితం ఆదర్శమైనదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నికరంగా నిలబడి పోరాడిన చరిత్ర పుతుంబాక దని అన్నారు. తెలంగాణలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టీచాకిరి విముక్తి కోసం, నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో పుతుంబాక తుపాకీ పట్టి పోరాడారని అన్నారు. సిపిఎం శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సభలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, డివిజన్ నాయకులు కట్టె పోగు ప్రకాశరావు బుల్లబ్బాయి అంకమ్మరావు కోటేశ్వరరావు కుంపటి వీరయ్య మరియదాస్ తదితరులు పాల్గొన్నారు

మెల్లంపూడిలో రిక్షా కార్మికులకు రిక్షాల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసి పరిధిలోని మెల్లంపూడి గ్రామంలో మంగళవారం మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకష్ణారెడ్డి సహకారంతో రిక్షా కార్మికులు కేతావత్ టాక్రియా, షేక్ వలి లకు వైఎస్ఆర్సిపి నాయకులు రిక్షాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు బి రాజారామిరెడ్డి, రామకష్ణారెడ్డి, శేఖర్, నాగుల్, షేర్ ఖాన్, అలం బుడే, అనిల్ రెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



పేదలపై పెను భారాలు : ఆలపాటి

ప్రజాశక్తి - తెనాలి : పేదలపై భారం మోపుతున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి చేపట్టిన జన జాగృతి యాత్రలో భాగంగా వరుసగా నాలుగో రోజు పట్టణంలోని 15వ వార్డులో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యటించారు. అలాగే చిరు వ్యాపారులను ఆయన పలుకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డిక్లరేషన్ రూపంలో వారితోనే పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసరాల ధరలు ప్రభుత్వం ఇష్టాను సారం పెంచేసిందని, అవి సామాన్యులకు భారంగా పరిణమించాయన్నారు. సంక్షేమం అంటూ ప్రచారానికే పరిమితమైన ప్రభుత్వం పేదల అవసరాలను తీర్చడంలో విఫలమైందనన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు త్వరలోనే ఉందన్నారు. ఆయన వెంట నాయకులు గిరి గణేష్, వై.అనిత, జెట్టి రేణుక, డాక్టర్ వి శేషగిరిరావు, మహమ్మద్ ఖుద్దూస్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఆలపాటి



ఏరువాక ఉత్సవాలకు సిద్ధవుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఈ నెల 4వ తేదీన ఏరువాక పౌర్ణమి సందర్భంగా జరిగే ఉత్సవాల కార్యక్రమాలలో పాల్గొని కోలాట ప్రదర్శన చేసేందుకు చిన్నారులు సిద్ధమవుతున్నారు. కాజ గ్రామం లో బాలల సంఘం, ఐద్వా ఆద్వర్యం లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులకు ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా అధ్యక్షులు దుర్గి నాగేశ్వర రావు శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బి. కోటేశ్వరి, సింహాద్రి సుమ, ఎ .విజయలక్ష్మి, ఎస్. విజయలక్ష్మి, బి. సత్యమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీ పరిష్కరించలేదు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామం తుంగభద్ర కాలువ వంతెన పక్కన ప్రధాన రహదారిలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాద భరితంగా మారింది. దీనిని అక్కడ నుంచి వేరే స్థలానికి మార్చమని గ్రామస్తులు ఇప్పటికే రెండు పర్యాయాలు మండల తాసిల్దార్ స్పందన కార్యక్రమంలో అర్జీలు అందించారు. అయినా ఫలితం లేదు. రోడ్డు పక్కనే రెండు అడుగుల ఎత్తున ఉండటం వలన పశువులు ట్రాన్స్ఫార్మర్ కు తగిలి గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. వర్షాకాలంలో పెద్ద మంటలు చెలరేగి ప్రాణ సంకటంగా మారింది. ఇప్పటికైనా ట్రాన్స్ఫార్మర్ ఆ ప్రదేశం నుంచి తొలగించాలని గ్రామ ప్రజలకు వేడుకుంటున్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -తెనాలి : వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేకును కట్ చేసి పార్టీ నాయకులు, అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా వికలాంగులకు ట్రై స్కూటర్లు అందించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదానసీం, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కుర్ర సుజాత, వీర్లపాటి విజయలక్ష్మి, పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని

ప్రభుత్వ ఉద్యోగుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం : సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిజిఇ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మండల అధ్యక్షులు పి. రాజబాబు, కార్యదర్శి షేక్ కాళీ, ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, కోశాధికారి తెనాలి లుర్దురాజు, వైస్ ప్రెసిడెంట్ హేమలత పాల్గొన్నారు.



కొడాలి నాని బహిరంగ క్షమాపణ చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ మంత్రి కొడాలి నాని కాపులను అసభ్య పదజాలంతో దూషించడం తగదని, బహిరంగ క్షమాపణ చెప్పాలని మంగళవారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ విమర్శించారు. మహానాడు విజయవంతం కావడంతో అది చూసి ఓర్వలేని కొడాలి నాని కాపుల గురించి అసభ్యకర పదజాలంతో మాట్లాడం తగదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి కొడాలి నాని చేత ఇలాంటి వ్యాఖ్యలు చేయించడం దారుణమన్నారు. వెంటనే నాని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గుడివాడ నియోజకవర్గంలో కాపులు బలమేమిటో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి కాపునాడు నాయకులు అమరా సుబ్బారావు, తోట సాంబశివరావు, బి కృష్ణ వందన, గోవాడ దుర్గారావు, ఏ కుసుమ, రంగశెట్టి నరేంద్ర, విన్నకోట శ్రీనివాసరావు, గాదె శ్రీనివాసరావు, ఏ మురళి తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణా శిబిరంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి - తెనాలి

విద్యార్థుల కోసం గ్రంధాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. స్థానిక నెహ్రూ రోడ్డులోని జిల్లా శాఖ గ్రంధాలయంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఇంకొల్లు రంగారావు పాల్గొని విద్యార్థులకు సైన్స్ పాఠ్యాంశాలపై వివరించారు. శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మెజీషియన్ కాటూరి నాగేశ్వరరావు విద్యార్థులకు వివిధ మేజిక్‌లను నేర్పించారు. మెజీషియన్స్ చేసే ప్రతి అంశం సైన్స్ తోనే ముడిపడి ఉంటుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి కే రమాదేవి మాట్లాడుతూ శిబిరంలో ఉదయం 8 నుంచి 8.30గంటల వరకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష ప్రధానంగా సాగుతుందన్నారు. శిబిరంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి షేక్ హుస్సేన్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం కలుగుతుందని గ్రంధాలయ నిర్వహకురాలు పి సుభాషిని, ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు పేర్కొన్నారు. పెదనందిపాడు లైబ్రరీలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు నీతి కథలు, నీతి పద్యాలు, అభినయ గేయాలు, చిత్రలేఖనం తదితర అంశాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు.

వినుకొండ సూరిబాబుకు డాక్టరేట్



ప్రజాశక్తి - వినుకొండ

నాణ్యమైన హోటల్ యాజమాన్య నిర్వహణలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వినుకొండ పట్టణానికి చెందిన ఇమ్మడిశెట్టి సూరిబాబు అందిస్తున్న సేవను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డులు ప్రదానం చేశారు. గత 30 సంవత్సరాలుగా పట్టణంలో సూరిబాబు శ్రీఆంజనేయ విలాస్ భోజన హోటల్ నిర్వహిస్తున్నారు. నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ హోటల్ యాజమాన్యపద్ధతులు పాటిస్తున్నారు. శ్రీశైలం, మంత్రాలయం, మహానంది లాంటి పుణ్యక్షేత్రాలకు, కర్నూలు, అనంతపురం, కడప తదితర ప్రాంతాలకు వినకొండ నుంచి వెళ్లే ఎంతోమంది వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర జిల్లా ఉన్నతాధికారులు ఎందరో శ్రీ ఆంజనేయ విలాస్ సూరిబాబు హోటల్లో భోజనం చేసి సామాన్యుడికి కూడా అందుబాటులో పరిశుభ్రమైన వాతావరణంలో క్వాలిటీ భోజనాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఎందరో అభినందించేవారు. సూరిబాబు అందిస్తున్న క్వాలిటీ హోటల్ మేనేజ్మెంట్, సోషల్ సర్వీసును గుర్తించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు రెండు రోజుల క్రితం చెన్నైలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసి సర్టిఫికెట్, మెమొంటో, గోల్డ్ మెడలను అందజేసి ఘనంగా సన్మానించారు. పేదలకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవ చేసే డాక్టర్ ఇమ్మిడిశెట్టి సూరిబాబును పట్టణానికి చెందిన ప్రముఖులు అభినందించారు.

విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బృందావన్ గార్డెన్స్, 4వ లైనులోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో ఇంటర్, ఆపై చదువులకు 2023-24 ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి, సమదుస్తులు, కాస్మోటిక్ ఛార్జీలు తదితర సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే వారు పుట్టిన తేదీ, కుల ధృవపత్రాలు, తెల్లరేషన్‌కార్డు, అంగవైకల్య ధృవపత్రం, బదిలీపత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం (మొదటి పేజి) కాపీ తీసుకురావాలన్నారు. అదనపు వివరాలకు 9542958956 నంబరులో సంప్రదించాలన్నారు.

3వ తేదీ నుండి గ్రూప్-1 మెయిన్స్

ఏర్పాట్లను పరిశీలించిన జెసి రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఎంపికై, మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు జూన్ 3వ తేదీ నుండి 10వ తేదీ వరకూ పలకలూరు, విజ్ఞాన్ నిరులా కాలేజిలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పరీక్ష ఏర్పాట్లను జెసి, జిల్లా కోఆర్డినేటర్ జి.రాజకుమారి మంగళవారం కళాశాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్ష గదులను, మంచినీటి సదుపాయం, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యములను గురించి తెలుసుకున్నారు. అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గుంటూరు జిల్లాలో గ్రూప్-1 మెయిన్స్‌కు మొత్తం 692 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నారని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని, అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయము 8.30 నుండి 15 నిముషముల అదనపు సమయముతో కలిపి 9-45ల వరకూ వరకు అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్, ఒరిజినల్ ఐ.డి. కార్డును తనిఖీచేసిన తరువాత మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, వారితోపాటు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలూ అనుమతించబడవని స్పష్టం చేశారు. కావున అభ్యర్థులు పరీక్ష నిబంధనలు గమనించి, సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు చుట్టగుంట సెంటర్‌లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ వద్ద డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం క్రింద ట్రాక్టర్లు, హార్వెస్టర్ల పంపిణీని జెండా ఊపి ప్రారంభించే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జూన్ 2వ తేదీన హాజరవుతున్నందున కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ , ఎమ్మెల్సీ తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి , ఎమ్మెల్యే షేక్.మహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సభా స్థలి ఏర్పాట్లు, బారికేడ్లు, ఎల్.ఈ.డీ.స్క్రీన్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, పారిశుధ్యం తదితర ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో చర్చించి, సూచనలు అందించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. అదే విధంగా పోలీసు కవాతు మైదానంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుప్రజ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా , గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

వెంకటపతి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు


గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఘన నివాళి



గుంటూరులో మాట్లాడుతున్న పాశం రామారావు



ముప్పాళ్లలో



చిలకలూరిపేటలో



సత్తెనపల్లిలో స్థూపం వద్ద విజయకుమార్ నివాళి



సత్తెనపల్లి సభలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

సిపిఎం నేత, సత్తెనపల్లి మాజీ శాసన సభ్యులు పుతుంబాక వెంకటపతి 30వ వర్ధంతి సభలను పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఘన నివాళులర్పించారు. ఆయన చిత్ర పటాలకు పూలమాల వేసి ఆయన ఆశయాలు సాధిస్తామని నినదించారు.

సత్తెపల్లి టౌన్ : ప్రజా సమస్యలు ఎక్కడ వుంటే అక్కడ పుతుంబాక వేంకటపతి ఉండేవారని ప్రజాసమస్యల పై పోరాడటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అని పల్నాడు జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ అన్నారు. మంగళవారం పుతుంబాక వర్ధంతి సందర్బంగా సత్తెనపల్లి ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లోని పుతుంబాక స్థూపం వద్ద నివాళులర్పించి ప్రసంగించారు. నేడు బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తూ, సంస్కరణల పేరుతో కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అండగా వారి అభివృద్ధే లక్ష్యంగా అనేక ప్రభుత్వ కంపెనీలను మూసి వేసి కార్మికుల ఉసురు పోసుకుంటుందన్నారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎ లక్ష్మేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య ప్రసంగించారు. వేంకటపతి అతి పిన్న వయస్సులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని తన తుది శ్వాస విడిచేవరకూ ఆదర్శ కమ్యూనిస్టుగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, నాయకులు ధరణికోట విమల, పి మహేష్, గుంటుపలి బాలకృష్ణ, గద్దె ఉమశ్రీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా వెంకటపతి చిత్రపటానికి పూల మాల వేసి నివాళుల ర్పించారు.

ప్రజాశక్తి-గుంటూరు

అమరజీవి పుతుంబాక వెంకటపతి ఆశయాలను, నేటి యువతరం కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వెంకటపతి వర్ధంతిని పురస్కరించు కొని, ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు వెంకట్రావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ వెంకటపతి ఫిరంగిపురం సమితి అధ్యక్షులుగా, సత్తెనపల్లి శాసన సభ్యునిగా నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. గ్రామాలలో రోడ్లు, మంచి నీటి వసతి, స్కూల్ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రధానంగా జిల్లాలో రైతాంగానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రుణాల రద్దుకు పోరాటాలు నడిపారన్నారు.జిల్లాలో పార్టీ అభివద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బి.జె.పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగిపోయాయన్నారు. ప్రజల ఆదాయాలు నానాటికి తగ్గిపోతున్నాయని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక హెూదా విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాస్, కళ్యాణి, సాంబశివరావు, కష్ణకాంత్, భగవాన్‌దాస్, కృష్ణ, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

మాజీ ఎమ్మెల్యే, సిపిఎం గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి పుతుంబాక వెంకటపతి 30వ వర్ధంతి తాడేపల్లి పట్టణంలోని కొత్తూరులో రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటపతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.సుబ్బారావు, డి.యోహాన్ పాల్గొన్నారు



తాడేపల్లిలో నివాళులర్పిస్తున్న పుతుంబాక భారతి



ఫిరంగిపురంలో

ముప్పాళ్ల :మండలంలో మాదల, నార్నెపాడు గ్రామంలో పుతుంబాక వెంకటపతి వర్ధంతి సభను సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మార్పుల వెంకటరెడ్డి, కందిమళ్ళ సాంబశివరావు, గారా జాలయ్య చింతపల్లి నాగమల్లేశ్వరరావు, రావిపాటి వెంకటేశ్వర్లు, నూకారపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పట్నంలోని మాచర్ల బస్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో పుతుంబాక వెంకటపతి 30 వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు లేళ్ల లక్ష్మీప్రసాద్ పుతుంబాక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, గుదే పూర్ణయ్య, శానం పుల్లయ్య, కాటమరాజు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక 2వ లైన్ పండరీ పురంలోని సిపిఎం కార్యాలయంలో పుతుంబాక వెంకటపతి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పెరుబోయిన వేంకటే శ్వర్లు, ఎస్ బాబు, ఎం విల్సన్, పి గణేష్ తదిరతులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో



వినుకొండలో

నూజెండ్ల : మండలంలోని గురప్ప నాయుడుపాలెం గ్రామంలో ఆశీర్వాదం ఆధ్వర్యంలో వెంకటపతి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంత రెడ్డి ప్రసంగిం చారు.

ప్రజాశక్తి - వినుకొండ : పుతుంబాక వెంకటపతి 30వ వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని వికలాంగుల కాలనీలో నిర్వహించారు. వెంకటపతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నాయకులు కే.హనుమంత్ రెడ్డి, బొంకూరి వెంకటేశ్వరరావు, సిలార్, అంగలకుదురు ఆంజనేయులు, మదర్ వలి, నవీన్, రంజాన్ బి, నాసర్ బి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి : తెలంగాణ సాయుధ పోరాట నాయకులు పుతుంబాక వెంకటపతి 30వ వర్ధంతి సభ స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగింది. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి. సూరిబాబు, నాయకులు నాగుల్ మీరా, పిచ్చయ్య వెంకటపతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫిరంగిపురం :కామ్రేడ్ పుతుంబాక వెంకటపతి వర్ధంతి సందర్భంగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు గ్రామంలో వెంకటపతి చిత్రపటానికి పూలమాలవేసి సిపిఎం మండల, గ్రామ కార్యదర్శి ఎస్.ఎం వలి, జి వి రావు, నాయకులు నతానీయేలు, లెనిన్, దిలీప్, ముద్దా రామయ్య నివాళులర్పించారు.